క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న జెడ్పీటీసీ

దహెగాం: మండలంలోని సహకార సంఘం కార్యాలయంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు గురువారం రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 65 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహకార సంఘం వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, ఏవో వంశీక్రిష్ణ, ఏఈవోలు శోభన్, వెన్నెల, సుష్మిత, సీఈవో బక్కయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: ఎమ్మెల్యే కోనేరు కోనప్ప విరాళంగా అందించిన 5 క్వింటాళ్ల బియ్యాన్ని మహారాష్ట్రలోని నాగపూర్‌లో గల దీక్షభూమి ఆధ్వర్యంలోని బౌద్ధ శిక్షణ కేంద్రానికి గురువారం అందించినట్లు కౌటాల ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ తెలిపారు. జూన్ 4న సిర్పూర్(టి)లో గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరించనున్న కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, నాయకులు సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రాజేశ్వరికి ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన రాంటెంకి కొండయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరికి సెల్ఫ్ డెవలాపర్స్ కోఆపరేటీవ్ సొసైటీ ఖమాన(ఎస్‌డీసీఎస్‌కే) సంఘం సభ్యులు గురువారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అధ్యక్షుడు జాడి భక్తరాజ్, ప్రధాన కార్యదర్శి చేతన్, కోశాధికారి జాడి టీమాజి, సభ్యులు శేఖర్, లోకేశ్, మనోహర్, సాగర్, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.


నేడు బీజేపీ మండల సమావేశం

కౌటాల: బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్ కవిరాజ్ తెలిపారు. ఆరే సంక్షేమ సంఘం భవనంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ మండల పదాధికారులు, కార్యకర్తలు, నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జీలు హాజరు కావాలని ఆయన కోరారు.

2కే రన్ విజయవంతం చేయాలి

వాంకిడి: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే 2కే రన్‌ను విజయవంతం చేయాలని ఎస్సై డి.సాగర్ కోరారు. ఉదయం 6 గంటలకు జరిగే 2 కే రన్‌లో మండల యువతి, యువకులు పాల్గొనాలని, పోటీలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

కూటి కోసం..తిప్పలు



ఆసిఫాబాద్‌అర్బన్: కూటి కోసం కోటి విద్యలు అన్న సామెత అక్షరాల నిజమని నిరూపిస్తున్నారు ఈ కళాకారులు. వరంగల్ జిల్లా నుంచి ముగ్గురు కళాకారులు తనదైన శైలిలో దేవతల వేషధారణలో జిల్లాకేంద్రంలోని పలు దుకాణాల్లో గురువారం తమ కళను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. దీంతో యజమానులు కొంత డబ్బులు ఇస్తున్నారు. ముగ్గురు యువకులు డిగ్రీ పూర్తి చేశామని, ఉద్యోగం లభించకపోవడంతో తమ పూర్వీకులు ఇలాంటి వేషధారణతో జీవనాన్ని కొనసాగించారని, తామే ఇలానే పాటలు పాడుతూ, డబ్బు సంపాదిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు ఒక్కొక్కరికి రూ.500 నుంచి 600 వస్తాయన్నారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే..!

- ఏజెన్సీ గ్రామాల్లోనే అగ్ని ప్రమాదాలు
- వేసవిలో పదుల సంఖ్యలో..
- కెరమెరిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రజల వేడుకోలు
- జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలకు ఉపయోగం



అనార్‌పల్లిలో దగ్ధమవుతున్న వాహనం (ఫైల్)

కెరమెరి: కెరమెరి అంటే అడవుల మండలం, అనేక గ్రామాల్లో పెంకుటిల్లు, పూరి గుడిసెలే ఉంటున్నాయి. మండలంతోపాటు జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల్లో ప్రతి వేసవిలో పదుల సంఖ్యలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఆసిఫాబాద్‌లో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం అందిస్తే ఘటన స్థలానికి ఫైరింజన్ చేరుకోవడానికి ఆలస్యమవుతోంది. అప్పటికే ఆస్తులు బుగ్గి పాలవుతున్నాయి. ఆసిఫాబాద్ నుంచి కెరమెరి మండల కేంద్రానికి 30 కి.మీ, ఆయా గ్రామాలకు 50 కి.మీలు, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలకు సుమారు 80 కి.మీ పైగా దూరం ఉంది. ప్రమాదం జరిగితే ఇక్కడికి ఫైరింజన్ వచ్చేసరికి వస్తువులు, సామగ్రి కాలిబూడదవుతున్నాయి. అప్పటికే వచ్చినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుంది.

దూరంలో గ్రామాలు

ఏజెన్సీ గ్రామాల్లోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. పరంధోళి, అంతాపూర్, కోండిబాగూడ, లక్మాపూర్, కోటా, మహరాజ్‌గూడ, పద్మావతి, లేండిగూడ, బోలాపటార్, జోడేఘాట్, టోకేన్‌మోవాడ్ లైన్‌పటార్ తదితర గ్రామాలు ఆసిఫాబాద్‌లోని అగ్నిమాపక కేంద్రానికి 50 కి.మీ పైగా దూరంలో ఉంటాయి. ఈ గ్రామాల్లో ప్రమాదం జరిగితే ఫైరింజన్ సంఘటన స్థలానికి వచ్చేసరికి గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. దీంతో ప్రమాదాలు నివారించడం,



కల్లెగాంలో అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు (ఫైల్)

అదుపు చేయడం సాధ్యం కావడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. కెరమెరిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే జైనూర్, నార్నూర్, సిర్పూర్(యూ) మండలాలకు సౌకర్యంగా ఉంటుంది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అధికారులు ఈ మేరకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కెరమెరిలో ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం కెరమెరిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో అగ్నిమాపక సిబ్బంది వారోత్సవాల్లో భాగంగా కెరమెరిలో నీటి విన్యాసాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలో అధికారులు, సిబ్బంది వివరించారు. ఇక్కడ ప్రమాదం జరిగితే ఆసిఫాబాద్ నుంచి ఫైరింజన్ రావడానికి ఆలస్యమవుతుందని, కెరమెరిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. సమీప జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, తదితర మండలాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

అధికారుల దృష్టికి..



వేసవిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సిర్పూర్(యు), లింగాపూర్, జైనూర్, కెరమెరి నాలుగు మండలాలకు మధ్యలో ఉన్న కెరమెరి మండలంలోని అగ్ని మాపక కేంద్రం మంజూరు చేయాలి. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తాం.

– పెందోర్ మోతిరాం, ఎంపీపీ, కెరమెరి

వేసవిలో పశువులు జాగ్రత్త!



- చూలు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి
- అపస్మారక స్థితికి వెళ్లి మరణిస్తాయి
- మధ్యాహ్నం వేళ మేతకు వదలవద్దు

కౌటాల: ఎండలు మండిపోతున్నాయి. వేసవికాలంలో మనుషులతోపాటు, పశువులూ వడదెబ్బకు గురవుతుంటాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు పశువులు వడదెబ్బ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను యజమానులకు కౌటాల పశువైద్యాధికారి ఎస్ శ్రీకాంత్ వివరించారు. ఉదయం, సాయంత్రం వేళలో పశువులకు మేత వేయాలి. మధ్యాహ్న సమయంలో మేత కోసం బయటకు తీసుకెళ్లవద్దు. పశువులకు నీటిని అందుబాటులో ఉంచాలి. మేతకు పచ్చిగడ్డి వేయాలి. పశువులకు ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా స్థానిక పశువైద్యశాలకు తీసుకురావాలి. ఇంకా ఆయన మాటల్లో..

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. పశువుల చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడ కోసం చెట్ల కిందకు చేరుతాయి. ఫిట్స్ లక్షణాలతో క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. వడదెబ్బతో ప్రభావం వల్ల చూలు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువుల్లో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. పాడిపశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుంది.

చికిత్స ఇలా..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రాంతానికి చేర్చాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి తీసుకురావడానికి పలుమార్లు నీటితో కడగాలి. తాగునీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజెక్షన్లు వేస్తారు. వాటికి సెలైన్ ద్వారా గ్లూకోజు, ఎలక్ట్రోలైట్స్ అందిస్తే నీరసం నుంచి బయటపడతాయి.

ముందస్తు చర్యలు తీసుకోవాలి..

- తాగునీరు అన్ని వేళలా అందుబాటులో ఉంచాలి. పశువులను రోజుకు కనీసం రెండుసార్లు చల్లని నీళ్లతో కడగాలి.
- చెరువులు, కుంటల్లో ఈదనివ్వాలి. గాలి వెలుతురు ప్రసారమయ్యేలా ఎత్తైన కొట్టం గడ్డితో నిర్మించాలి. రేకులు ఉంటే వరిగడ్డి పరిధి మధ్యాహ్నం వేళలో నీరు చల్లాలి.
- షెడ్ల నిర్మాణం తూర్పు, పడమర దిశలో జరగాలి. దీనివల్ల వడగాల్పుల నుంచి తూర్పు, పడమర ఎండల నుంచి రక్షణ లభిస్తుంది.
- పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం పాలు పితికేటప్పుడు పొదుగును చల్లని నీటితో కడగాలి.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

- అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న చాహత్ బాజ్‌పాయ్

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, విద్యుత్, విద్యా, ప్రజా ఆరోగ్యం, రెవెనూ, ప్రజాపంపిణీ, ఐకేపీ, ఆర్టీసీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖ, ఐసీడీఎస్ అధికారుల తమ తమ శాఖల పనులకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మూడవ శనివారం మండల స్థాయిలో నిర్వహించే సమావేశంలో అన్ని సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో గౌరవ సభ్యులు లేవనెత్తే ప్రతి సమస్యను శాఖల అధికారులు నోట్ చేసుకుని తదుపరి సమావేశంలోగా పరిష్కరించాలన్నారు. వేసవిలో మండలంలో ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీటి ప్రతి ఇంటికి చేరాలన్నారు. మారుమూల గ్రామమైన తుంగెడకు చెందిన డోంగ్రి రేవయ్య సివిల్స్‌లో ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. జిల్లాలోని విద్యార్థులు అతన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పలు గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, సర్పంచులు సోమశేఖర్, పోషమల్లు, మాధవి, శాంత, అహల్యాదేవి, వినోద, పోషయ్య, హన్మక్క, ఎంపీటీసీలు శ్రీనివాస్, రాము, శ్రీవాణి, సాగరమ్మ, కోఆప్షన్ సభ్యుడు జహురోద్దీన్, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బుచ్చన్న, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల నిరసన



నిరసన తెలుపుతున్న వీవోఏలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట గత 39 రోజులుగా ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం వీవోఏలు గంట పాటు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వీవోఏలు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

రెబ్బెన: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసును రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. తమ పట్ల సానుకూలంగా వ్యవహరించిన కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పని చేసి గ్రామాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు శ్రీనివాస్, సాగరమ్మ, సర్పంచులు మాధవి, శాంత, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కూరగాయల ధరలు



కూరగాయలు	కిలో(రూ.లో)
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	60
టమాట	20
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంత	40
దొండకాయ	60
మిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
గోబి(పూల్)	40
క్యాబేజి	40

– ఆసిఫాబాద్‌అర్బన్

సినిమాలు



ఆసిఫాబాద్ (కొమ్రంభీం ఏ/సీ): బిచ్చగాడు–2

కాగజ్‌నగర్(వెంకటరమణ, ఏ/సీ): బిచ్చగాడు–2



టీఆర్‌నగర్‌లో రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త

పేరుకుపోయిన చెత్త



బాపునగర్‌లో డ్రెయినేజీలో నిండిన చెత్త

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై చెత్త వేస్తుండడంతో దుర్గంధం వస్తోంది. డ్రెయినేజీల్లో చెత్త నిండి ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో రోగాల బారిన పడుతామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకుని డ్రెయినేజీలను శుభ్రం చేసి చెత్త తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఇల్లే పూలవనం..



కెరమెరి: ఇంటి ముందు రకరకాల పూలు ఉంటే ఎంతో అందాన్నిస్తాయి. విరబూసిన పూలు..చూడగానే మనస్సుకు హాయిని కలిగిస్తున్నాయి. మండలంలోని కొలాంగూడ(కెలిబి) గ్రామంలో ఓ ఇల్లే పూలవనంగా తయారైంది. సాంగ్విలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న మడావి లలిత.. కొలాంగూద(కెలిబి)లో నివాసముంటుంది. రేకుల ఇల్లే అయినా ఆవరణలో సుగుంధాలు ఇచ్చే మొక్కలు, తీగజాతి మొక్కలు, విరబూసిన పువ్వులు కనువిందు చేస్తున్నాయి.



సభ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈనెల 6న నిర్వహించే రిపబ్లిక్ మంచ్ సభను విజయవంతం చేయాలని దళిత సంఘం రాష్ట్ర నాయకుడు జాడే నాగోరావు కోరారు. మండల కేంద్రంలోని బౌద్ధవిహార్‌లో గురువారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలు, బహుజనుల ఐక్యత కోసం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ హాజరవుతారన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కేశవ్ కర్మాన్కర్, సందీప్, నగేశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేయాలి

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో దివ్యాంగుల కోసం నూతన కాలనీ ఏర్పాటు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీ పార్కులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన కాలనీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 2014లో ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట 103 రోజుల పాటు ధర్నా చేశామన్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే జోగు రామన్న నూతన కాలనీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయినా ఇప్పటి వరకూ కాలనీ ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు ఎండీ.ఇమ్రాన్, నీత, జ్యోతి, దాసరి లలిత, లత, షాకీర్, మన్సూర్, సాజిద్, కలీల్ తదితరులు పాల్గొన్నారు.